# శ్రీరాముడిగా.. వేంకటేశ్వరుడిగా

- యాదగిరిగుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు
- గుట్టకు పోటెత్తిన భక్తజనం



తూర్పు రాజగోపురం వద్ద క్యూలైన్‌లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు మూడోరోజు సోమవారం కనుల పండువగా కొనసాగాయి. స్వామికి నిత్యారాధనల అనంతరం ఆలయ మొదటి ప్రాకార మండపంలో తిరుప్పావై గోష్టి నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నవకలశ, నమ్మాళ్వారుకు అభిషేకం ఘనంగా జరిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామి వారు ఉదయం శ్రీరాముడిగా.. సాయంత్రం వేంకటేశ్వరుడిగా దర్శనమిచ్చారు. వరుస సెలవుల నేపథ్యంలో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఎటుచూసినా భక్తులే దర్శనమిచ్చారు.

## ఉదయం శ్రీరాముడిగా

అధ్యయనోత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహ స్వామిని ఉదయం శ్రీరాముడి అలంకార సేవలో ప్రధానాలయ తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. పశ్చిమ సప్తతల రాజగోపురం గుండా స్వామి వారి సేవను ఆలయ తిరుమాఢ వీధుల్లోకి తీసుకొచ్చారు. ఉత్తర, తూర్పు, దక్షిణ రాజగోపురాల్లోని తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. భక్తులు అలంకార సేవను కనులారా వీక్షించి తరించారు.

## అలంకార విశిష్టత

భగవానుడి అనేక అవతారాల్లో అత్యంత వైభవోపేతమైన అవతారం శ్రీరామవతారం. దుష్ట శిక్షణ, శిష్ట పరిరక్షణార్థం మానువులను దృష్టిని ధర్మం వైపు మళ్లించిన ఆదర్శమూర్తి శ్రీరాముడు. లోక కల్యాణార్థం భువిపై అవతరించిన రూపమే శ్రీరామచంద్రుడు. శ్రీరాముడు ధర్మజ్ఞానుడని, సత్యసుంధుడని మొదలగు కల్యాణ గుణాలను రామాయణంలో ఎంతో కీర్తించారు. స్వార్థాన్ని జయించిన ధర్మమే శ్రీరాముడు. ధనస్సును చేపట్టిన ధర్మమే కోదండరాముడు. ప్రజాహితాన్ని పరమార్థంగా భావించిన ధర్మమే పట్టాభిరాముడు. మానవుడు జీవితంలో స్వార్థాన్ని వదిలి, ధర్మాన్ని అవలంబించి పురోగమించినప్పుడే మహోన్నతుడు అవుతాడని నిరూపించిన తీరు శ్రీరామ అలంకార సేవలో దర్శించవచ్చునని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు.

### ఎటు చూసినా భక్తజనమే

వరుస సెలవులు కావడంతో లక్ష్మీనరసింహుడి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం పోటెత్తింది. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపం భక్తులతో సందడిగా మారింది. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేదాశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవమూర్తిని అర్చించారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో పరమశివుడికి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.74,94,698 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.



శ్రీరాముడు, వేంకటేశ్వరుడి అలంకారాల్లో లక్ష్మీనరసింహ స్వామి

## సాయంత్రం శ్రీవేంకటేశ్వుడిగా

అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంత్రం లక్ష్మీనరసింహుడికి ప్రధానాలయ ద్రావిడ ప్రబంధ సేవా కాలాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామిగా అలంకరించి ప్రధానాలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలు అందించారు. సన్నాయి మేళంలో అర్చకులు, పారాయణికులు, రుత్వికుల వేద మంత్రోచ్చారణతో ప్రధానాలయం మార్మోగింది. వేడుకల్లో ఆలయ ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, మోహనాచార్యులు, ఏఈఓ రఘు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అలంకార విశిష్టత

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి. వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణమైనా దర్శించినా, స్మరించినా ముక్తి అని పురాణాల్లో పేర్కొన్నారు. వేం అనగా పాపం, కటతీ అనగా పోగొట్టువాడు అని అర్థం. దర్శనంతోనే సమస్త కోర్కెలు నెరవేర్చగలిగిన దివ్యమూర్తి శ్రీవేంకటేశ్వరుడు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆపద్బాంధవుడిగా, అనాథ రక్షకుడిగా, పిలిస్తే పలికే దైవంగా భక్తుల పాలిటి కల్పతరువుగా స్వామి వారు అవతరించారు. వేంకటేశ్వర స్వామి వారి దివ్య అలంకార సేవలో వెంకటనారసింహుడిగా మన లక్ష్మీనరసింహుల దర్శనం సర్వవిధ శుభప్రదమని ఆలయ ప్రధానార్చకులు తెలిపారు.



తూర్పు రాజగోపురం వద్ద క్యూలైన్‌లో భక్తుల సందడి

# శాంతి, సహనాలకు ప్రతీక క్రిస్మస్

- మహోన్నత క్షమాగుణ సంపన్నుడు ఏసుక్రీస్తు
- తెలంగాణ అభివృద్ధి, ప్రశాంతత, ఐక్యతను పెంచిన ఘనత కేసీఆర్‌దే
- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పలు చర్చిల్లో ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు



సూర్యాపేటలోని సిలోయం చర్చిలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, డిసెంబర్ 25 : శాంతి, సహనాలకు క్రిస్మస్ ప్రతీక అని, ఏసుక్రీస్తు మహోన్నత క్షమాగుణ సంపన్నుడని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, అవధులు లేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉన్న కరుణామయుడు ఏసుక్రీస్తు అన్నారు. ఆయన బోధనలు అనుసరణీయమని తెలిపారు. సర్వ మతాల సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో శాంతి సామరస్యాలతో ఐక్యతను పెంపొందించారన్నారు. అన్ని వర్గాల ప్రజలు తనను మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, అందరి నమ్మకాన్ని నిలబెడుతూ సూర్యాపేటను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు, ఆయా చర్చిల పాస్టర్లు సిల్వి, డాక్టర్ ప్రభుదాస్, సాల్మన్‌రాజు, నాయకులు అనుములపురి రవిబాబు, ఉప్పల ఆనంద్, పూర్ణ శశికాంత్, మద్ది శ్రీనివాస్‌యాదవ్, రమా కిరణ్, గుండపనేని కిరణ్ పాల్గొన్నారు.

# అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యం రీ సైక్లింగ్

- రీ సైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబర్ 25 : అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్నారని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రేషన్ దుకాణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చాలా వ్యయంతో బియ్యాన్ని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేస్తున్నదన్నారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ కార్డులపై ప్రజలకు నాణ్యమైన బియ్యం అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 89 లక్షల కుటుంబాలకు 6కిలోల చొప్పున బియ్యం సరఫరా చేస్తున్నామని, రేషన్ బియ్యం పక్క దారి పట్టకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని మంత్రి చెప్పారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రూ.56 వేల కోట్ల అప్పుల్లో, 11వేల కోట్ల రూపాయల నష్టాల్లో ఉన్నదని తెలిపారు. మిల్లర్ల దగ్గర రూ.22వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కార్పొరేషన్ నిల్వ ఉంచిందన్నారు. రాష్ట్రంలోని ధాన్యాన్ని మహారాష్ట్ర, కర్ణాటక రాష్టాలకు అమ్మేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిల్లర్లు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రేషన్ బియ్యం పంపిణీని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.